ఓం నమఃశివాయ

• మహా శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు • భక్తుల రద్దీ దృష్ట్యా శివాలయాల వద్ద పెద్ద ఎత్తున ఏర్పాట్లు


భక్తుల రద్దీ దృష్ట్యా బారికేడ్లు ఏర్పాటు చేసిన ఆలయ నిర్వాహకులు

మోతీనగర్: అల్లాపూర్, మూసాపేట డివిజన్లలోని పలు శివాలయాలు మహా శివరాత్రికి ముస్తాబయ్యాయి. ఈనెల 8న మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్‌నగర్‌లోని పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం మహా శివరాత్రి సందర్భంగా ఉదయం 4 గంటల నుంచి శివాభిషేకాలు భక్తులు సంప్రదాయ వస్త్రాలతో గర్భాలయ ప్రవేశం ఉంటుంది. వివాహ సంబంధిత దోషాలు, అన్యోన్య దాంపత్యం కోసం పూజలు, మృత్యుదోష నివారణకు రాత్రి 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం 12 గంటలకు బస్మాభిషేకం, విశేషాలంకరణ, హారతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ అర్చకులు అవినాష్ శర్మ పేర్కొన్నారు.

◆ వి.రామారావునగర్‌లోని శివాలయంలో మహా శివరాత్రి సందర్భంగా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాటు చేశారు. గణేష్‌నగర్, తులసినగర్, రాథాకృష్ణనగర్, ఆర్‌కె సొసైటీ, యూసుఫ్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్, సఫ్దార్‌నగర్‌లలోని పలు శివాలయాలను ముస్తాబు చేశారు. అదే విధంగా మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని శివాలయంలో శివరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని కార్యనిర్వాహణాధికారి జీఏకే కృష్ణ పేర్కొన్నారు. పార్వతి రామలింగేశ్వర స్వామివారికి విశేష పూజ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

◆ ఉదయం 4.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, 6.30 గంటల నుంచి రుద్రాభిషేకాలు, పూజలు జరుగుతాయని ఆలయ చైర్మన్ వివిఎస్‌వీ సత్యనారాయణ తెలిపారు. రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం రాత్రి 11.30 గంటలకు లింగోద్భవ కాలంలో ఏకవార రుద్రాభిషేకం ఉంటుందని తెలిపారు. అదే విధంగా శంకరమఠంలోని శంకర్ శివాలయంలో కూడా మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కబీర్‌నగర్‌లోని శ్రీ శివరామాంజనేయ దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబు చేశారు.


భక్తులకు ఎండ నుంచి ఉపశమనం కలిగించేందుకు చలువ పందిళ్ల ఏర్పాటు

అన్ని ఏర్పాట్లు చేశాం



మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా శివ పార్వతులకు ప్రత్యేక పూజలతో పాటు కల్యాణం నిర్వహిస్తాం. భక్తులకు దర్శనంలో ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశాం. ఎండవేడిని తట్టుకోవడానికి చలువ పందిళ్లను ఏర్పాటు చేశాం. భక్తులు అధిక సంఖ్యలో వస్తారని వారికి కావాల్సిన వసతులు ఏర్పాట్లు చేశాం.

– జీఏకే కృష్ణ, ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం

ఇక్కడ జ్యోతిర్లింగాల దర్శనం చేసుకోవచ్చు...


గాయత్రినగర్‌లో ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగ ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, బ్రహ్మకుమారీలు

మోతీనగర్: ప్రజాపిత బ్రహ్మకుమారి మోతీనగర్ శాఖ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో హరిహర దేవస్థానం సమీపంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శన ప్రదర్శనను అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి గురువారం ప్రారంభించారు.మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఒకేచోట దేశం నలుమూలల ఉన్న జ్యోతిర్లింగాలను దర్శించుకునే భాగ్యాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాజయోగ బోధకులు బీకే భాగ్యలక్ష్మి, ప్రతినిధులు డాక్టర్ సదానందం ఇన్‌స్పెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహరక్షేత్రంలో 8వ తేదీన మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణసూరి తెలిపారు. గురువారం సాయంత్రం గణపతి పూజ, రుద్ర హోమం నిర్వహించామని పేర్కొన్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 నుంచి కాశీవిశ్వేశ్వరస్వామికి సామూహిక సంతధార అభిషేకాలు, రుద్రహోమం, అర్చనలు, రాత్రి 9.30 గంటలకు కాశీవిశాలాక్షి విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం, అనంతరం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 9వ తేదీన నిత్యాభిషేకం, రుద్రహోమం వంటి పూజా కార్యాక్రమాలు ఉంటాయని అన్నారు. శివరాత్రి రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఔట్ స్టాండింగ్ పేపర్ అవార్డు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పరిశోధక విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కెనడాలోని వాంకోవర్‌లో ఏఏఏఐ సంస్థ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సదస్సులో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఈ సదస్సులో 12వేలకు పైగా పేపర్‌లను సమర్పించగా అందులో మూడింటిని మాత్రమే ఔట్ స్టాండింగ్ పేపర్ అవార్డుకు ఎంపిక చేశారు. ఆ మూడింటిలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సమర్పించిన పేపర్ కూడా ఉండడం విశేషం.

మహిళల కోసం బీ ఫిట్ విత్ ఇనార్బిట్

సాక్షి, సిటీబ్యూరో: మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్ బీ ఫిట్ విత్ ఇనార్బిట్ పేరిట ఫిట్‌నెస్ సెషన్‌లను నిర్వహిస్తున్నట్టు గురువారం మాల్ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా ఉచిత జుంబా క్లాసెస్ నిర్వహిస్తున్నామన్నారు. అంతే కాకుండా ఈ నెల 31 వ తేదీ వరకు కాంప్లిమెంటరీ మేక్‌ఓవర్‌లు వైద్య నిపుణులతో ఉచిత స్కిన్ కన్సల్టేషన్‌లు, కనుబొమ్మలను అందంగా తీర్చిదిద్దుకొనేందుకు తరగతులు తదితరాలను అందుబాటులోకి తెచ్చామన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థుల ప్రతిభ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్ (పీఎంఆర్‌ఎఫ్) పరిశోధక విద్యార్థులు ప్రతిభ చాటారు. ఐఐటీ ఇండోర్‌లోని పీఎంఆర్‌ఎఫ్ వార్షిక సింపోజియంలో తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. రాడార్ సోర్స్‌ని ఉపయోగించి రియల్ టైమ్ హిడెన్ మెటాలిక్ వస్తువులను, మాంసం తాజాదనాన్ని కొలవడంపై పరిశోధనలు చేశారు.హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొ.అనిల్‌కుమార్ చౌదరితో పరిశోధక విద్యార్థులు చందన్‌ఘోరుయ్, ముకులిక మండల్, స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని ప్రొఫెసర్ జేఎస్ఎస్ ప్రకాశ్ పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థి ఆర్ శారద, సుమీ రాణా డాక్టర్ ఎం ముత్తమిలరసన్‌తో కలిసి పనిచేస్తున్నారు. వారిని గురువారం హెచ్‌సీయూలో పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

సామాజిక సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలి

రాయదుర్గం: సామాజిక సమస్యలకు స్థిరమైన పరిష్కారాలు కావాలని హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఫుర్కాన్ కమర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ఉర్దూ సోషల్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో భాగంగా 'టెక్నాలజీ–సొసైటీ అండ్ ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక శాస్త్రవేత్తలు సామాజిక సమస్యలను అన్వేషించాలన్నారు. స్థిరమైన పరిష్కారాలను కనుగొనడంలో సహాయం చేయాలని సూచించారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ డైరెక్టర ప్రొఫెసర్ ధనంజయ్‌సింగ్ మాట్లాడుతూ మానవీయశాస్త్రాలు, సామాజిక శాస్త్రాల మధ్య అంతరాన్ని తగ్గించాల్సిన అవసరంపై దృష్టి పెట్టాలన్నారు. 'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హాసన్ మాట్లాడుతూ సమాజంలోని సమస్యలకు పరిష్కారాలను కనుగొనడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10న జాతీయ సదస్సు

ఖైరతాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ సమస్యలపై ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.శివరాజ్ తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అభిమానులు, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనే జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో పాటు ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సమస్యలపై జాతీయ సదస్సులో చర్చించడంతో పాటు పలు తీర్మానాలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.

ఘనంగా విజేత సూపర్ మార్కెట్ సిల్వర్ జూబ్లీ వేడుకలు


విజేత సూపర్‌మార్కెట్ వార్షికోత్సవంలో పాల్గొన్న మురకొండ జగన్‌మోహన్ రావు, శ్రీమతి కృష్ణవేణి, సందీప్ చౌదరి, సిద్ధార్థ, ఉద్యోగులు

కూకట్‌పల్లి: విజేత సూపర్‌మార్కెట్ 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం ప్రధాన కార్యాలయం చందానగర్, అమీన్‌పూర్‌లలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. 25 సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వినియోగదారులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు, తాజా కూరగాయలు, పండ్లు, వివిధ రకాల వస్తువులు, గృహోపకరణాలు అందిస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్‌మోహన్ రావు తెలిపారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1999 మార్చి 7న మొదటి బ్రాంచ్‌ను ప్రారంభించి నేడు 109 బ్రాంచిలతో విజేత సూపర్ మార్కెట్ బ్రాండ్ ఐకాన్‌గా నిలిచిందన్నారు. మమ్మల్ని నమ్మిన వినియోగదారులకు మాకు అండగా నిలిచిన డిస్ట్రిబ్యూటర్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ 25 సంవత్సరాల ప్రయాణంలో తమకు సహాయ, సహకారాలు అందించిన కుటుంబ సభ్యులు, విజేత కుటుంబంలో భాగమైన ఉద్యోగులు ఈ విజయంలో కీలకపాత్ర వహించినందుకు గర్వపడుతున్నానని అన్నారు. ఎంతోమందికి ఉపాధి కల్పించినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.

◆ ఈ వార్షికోత్సవం సందర్భంగా జూబ్లీ జాక్‌పాట్ లక్కీ డ్రా ద్వారా మొదటి బహుమతి టాటా నెక్సాన్ కారు, ద్వితీయ బహుమతులు 5 రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, తృతీయ బహుమతులు 25 చేతక్ ఈవి స్కూటర్లు, బోనస్ బహుమతులు 111 మంది లక్కీ విజేతలకు పానాసోనిక్ కుక్కర్లను అందజేయనున్నట్లు తెలిపారు.

◆ ఫిబ్రవరి 23 నుంచి మార్చి 31వ తేదీ వరకు విజేత సూపర్‌మార్కెట్‌లో రూ.500 కొనుగోలు చేసి కూపన్ పొందిన వారు లక్కీడ్రాకు అర్హులకు వార్షికోత్సవం, మహిళా దినోత్సవం సందర్భంగా ఉద్యోగులందరికి బహుమతులు అందజేశారు.

◆ ఈ కార్యక్రమంలో విజేత సూపర్‌మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్ మోహన్ రావు, శ్రీమతి కృష్ణవేణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురకొండ సందీప్ చౌదరి, మార్కెటింగ్ డైరెక్టర్ సిద్ధార్థ, డిస్ట్రిబ్యూటర్లు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన వారితో బండి రమేష్, హరివర్ధన్‌రెడ్డి


కూకట్‌పల్లి: బేగంపేట డివిజన్ శ్యామ్‌లాల్ బిల్డింగ్ మయూర్ మార్గ్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి సమక్షంలో శ్రీనివాస్ రెడ్డి, పద్మారెడ్డి, మోహన్‌రెడ్డి, దీపుకుమార్, రాకేష్, ఏకే జహంగీర్, బబ్లు, దివాకర్, సికందర్, అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తూ, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై పలువురు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట రమేష్, శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్‌కుమార్, బేగంపేట్ జాన్, భరత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని పాత ఎల్‌ఐసీ బిల్డింగ్ సమీపంలో భూగర్భ డ్రైనేజీ పనులను గురువారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పనులు గణేష్ టెంపుల్ నుంచి రాఘవేంద్ర వైన్స్ వరకు అదే విధంగా బాలనగర్ కుమ్మరిబస్తీలో కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్‌కుమార్, నాయకులు మొహమ్మద్ ఖాజా, నాయకులు కృష్ణమూర్తి, యాదగిరి, రామేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పంచశీల పాఠశాలలో మహిళా దినోత్సవం


స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు



మూసాపేట: మూసాపేటలోని పంచశీల పాఠశాలలో గురువారం మహిళా దినోత్సవం, మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులతో పాటు డాక్టర్, లాయర్, ఇంజినీర్ వంటి వేషధారణలో ఆకట్టుకున్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ బస్తీ ఎన్నికల్లో సీహెచ్. గిరి ప్యానెల్ విజయం

బాలానగర్: బాలానగర్ డివిజన్ ఇందిరానగర్ బస్తీ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం జరిగాయి. ఈ అసోసియేషన్ ఎన్నికల్లో సీహెచ్. గిరి ప్యానెల్ విజయం సాధించటం హర్షించదగ్గ విషయమని సీపీఎం మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పేర్కొన్నారు. ఒకే ప్యానెల్‌లో ముగ్గురు గెలవటం మార్పునకు కారణమన్నారు. ఇందిరానగర్ బస్తీలో పేద ప్రజలకు, కార్మికులకు చేదోడు వాదోడుగా నిలవాలని బస్తీ అభివృద్ధిలో నడవాలని, ఎర్ర జెండా పేదల పక్షాల నిలబడతామని అన్నారు. 40 ఏళ్లుగా నివాసముంటున్న పేదలకు అండగా నిలబడాలని నూతన కమిటీని కోరారు. అనంతరం సీహెచ్. గిరిసాగర్, ఎం.అర్జున్, బి.రాజులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం. సతీష్ కుమార్, ధర్మారావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోకు ఉత్తమ అవార్డు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోకు గురువారం ఉత్తమ డిపో అవార్డు లభించింది. నగరంలో జరిగిన గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌లో ఎక్కువ నగదు సాధించినందుకు అవార్డులు అందజేశారు. రాష్ట్రస్థాయిలో సికింద్రాబాద్ రీజినల్ 2వ స్థానంలో అవార్డు అందజేశారు. రీజినల్ పరిధిలోని 12 డిపోల మేనేజర్‌లను ఆర్టీసీ చైర్మన్ సజ్జనార్ సన్మానించారు. కూకట్‌పల్లి మేనేజర్ మహమ్మద్ ఇషాక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12 డిపోల్లో కూడా కూకట్‌పల్లి డిపో ముందంజలో ఉందన్నారు. కార్మికులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతోనే ఈ అవార్డు వరించిందని తెలిపారు. డిపో మేనేజర్‌తో పాటు సీఏ శ్రీలత, మెకానిక్ ఫోర్‌మెన్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ చైర్మన్ సజ్జనార్ నుంచి అవార్డు అందుకుంటున్న కూకట్‌పల్లి డీఎం మహమ్మద్ ఇషాక్

నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయిచరణ్‌కాలనీకి చెందిన సుబ్బారావు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. గురువారం మంజూరైన చెక్కును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని తెలిపారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పోతుల రాజేందర్, కాశీనాథ్‌యాదవ్, శ్రీనివాస్‌చౌదరి, ఎల్లం నాయుడు, వేణు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని శేషాద్రి నగర్ కమ్యూనిటీహాల్‌లో పారిశుద్ధ్య కార్మికులకు పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ పాల్గొని మాట్లాడారు.నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ డాక్టర్ మహేశ్వర్, డాక్టర్ సిలివ్రియా, డాక్టర్ రాజేందర్‌రావు, డాక్టర్ శిరీష, డాక్టర్ దయాదేవి, రామ్‌దేవ్‌రావు ఆస్పత్రి నిపుణులు తదితరులు పాల్గొని పౌష్టికాహారం, పరిశుభ్రతపై, ప్రతి రోజూ పారిశుద్ధ్య కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు అందించారు. పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల గురించి వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఎంఒహెచ్ డా. పద్మజ, డీసీ రమేష్, మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ శరమన్‌రాయ్, డాక్టర్ భార్గవ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ట్యాంకర్లు, బోర్లు ధ్వంసం



సాక్షి ఎఫెక్ట్..


అక్రమ వాటర్ ప్లాంటు, బోర్‌వెల్‌ను ధ్వంసం చేసిన అధికారులు

మోతీనగర్: అక్రమంగా బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముకుంటున్న ట్యాంకర్లపై ఇటీవల 'నీటి దందా వాల్లా చట్టానికి తూట్లు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైంది. దీనికి స్పందించి గురువారం అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్‌లోని అక్రమ వాటర్ ప్లాంట్లు, బోర్లను జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్, కూకట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, ఇరిగేషన్ శాఖ అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అక్రమంగా వెలసిన వాటర్ ప్లాంట్లు, బోర్‌వెల్‌లను జేసీబీతో ధ్వంసం చేశారు.

ఖేలో ఇండియా పోటీల్లో నాగసాయి ఆర్షికి బంగారు పతకం


నాగసాయి ఆర్షిని అభినందిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ చాంపియన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమికి చెందిన విద్యార్థి నాగసాయి ఆర్షికి పుదుచ్చేరిలో నిర్వహించిన మొదటి ఖేలో ఇండియా ఉమెన్స్ తైక్వాండో లీగ్ 2023–24 ఫేజ్ 3లో 51 కేజీ విభాగంలో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని గురువారం విద్యార్థిని మర్యాదపూర్వకంగా కలిసింది. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించిన క్రీడాకారిణిని, కోచ్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. నేటి సమాజంలో చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరమని, ఆత్మరక్షణ కోసం కరాటే, కుంగుఫూ, తైక్వాండో వంటి విద్యలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అదే విధంగా చిన్నారుల్లో దాగిన నైపుణ్యాన్ని గుర్తించి ఆ విధంగా ప్రోత్సహించటం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. పేదరికం అనేది విజయాలకు అడ్డంకి కాదని నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ మధుసూదన్, పవన్‌కుమార్, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మాటలను ప్రజలు నమ్మరు

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో బండి రమేష్

బాలానగర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్‌ఆర్‌పీ ఇన్‌చార్జి వనజ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు కొప్పిశెట్టి దినేష్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు వంద మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వీరికి బండి రమేష్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలని సూచించారు. కొంతమంది కేవలం మూడు నెలలు గడవక ముందే కాంగ్రెస్ పార్టీని అప్రతిష్టపాలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా బీఆర్‌ఎస్ చెప్పే మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరి సతీష్‌రెడ్డి, పుష్పారెడ్డి, రేష్మ, సాధుప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, స్వరూప, మేకల మైఖేల్, దేవ సహాయం, సంజీవరావు, ఫణీంద్ర, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌నగర్‌లోని ఆక్రమణల తొలగింపు


గోపాల్‌నగర్‌లో ర్యాంపులు, సన్‌షేడ్‌లను తొలగిస్తున్న అధికారులు



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ గోపాల్‌నగర్‌కాలనీలో 40 ఫీట్ రోడ్డును ఆక్రమించి ర్యాంపులు, సన్‌షేడ్స్, టిఫిన్, టీ సెంటర్‌లు ఏర్పాటు చేయటంతో వాహనదారులు, పాదచారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు అందింది. వెంటనే ఆమె ఆదేశాల మేరకు గురువారం గోపాల్‌నగర్‌లో నిర్మించిన ఆక్రమణలను తొలగించారు. ఏసీపీ మల్లేశ్వర, జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించారు.